## క్లుప్తంగా

### పుస్తకాల వితరణ

సారవకోట: మండలంలోని చీడిపూడి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 110 మంది విద్యార్థులకు అవలింగి గ్రామానికి చెందిన పైడిశెట్టి రాంబాబు రూ.9 వేల విలువ చేసే హిందీ పుస్తకాలు మంగళవారం అందజేశారు. హిందీ ప్రైమరీ 1, 2 పుస్తకాలను అందజేసినట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల పూర్వపు విద్యార్థి నిక్కు ప్రకాశ్ జ్ఞాపకార్థం విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేశారు.

### గంజాయితో వ్యక్తి అరెస్టు

పాతపట్నం: మండలంలోని అచ్యుతాపురం కూడలి వద్ద మంగళవారం ఎస్‌ఐ బి.లావణ్య పోలీసులతో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించినట్లు సీఐ నల్లి సాయి తెలిపారు. పాతపట్నంకు చెందిన వ్యక్తిని 1170 గ్రాముల గంజాయితో పట్టుకున్నామన్నారు. ముందస్తు సమాచారంతోనే తనిఖీలు చేపట్టామన్నారు.

### ఆశ్రమ పాఠశాల పరిశీలన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీఓ

సారవకోట: వసతిగృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సీతంపేట ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు సూచించారు. మంగళవారం మండలంలోని సవరబొంతు ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో పలు అంశాలపై సమీక్షించారు. వసతిగృహంలో మరుగుదొడ్ల నిర్వహణ, మెనూ, వసతిగృహం పరిసరాలను పరిశీలించారు. దసరా సెలవులలో పాఠశాలలో ఉన్న మరమ్మతులు పూర్తి చేయించాలని, పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు.

### సబ్ రిజిస్ట్రార్‌గా బసవేశ్వరరావు



నరసన్నపేట: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా బసవేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఈయన అనకాపల్లి నుంచి నరసన్నపేటకు వచ్చారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

### ఫారెస్ట్ రేంజర్‌గా అమ్మన్నాయుడు



పాతపట్నం: స్థానిక అటవీ శాఖాధికారిగా టి.అమ్మన్నాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నరసన్నపేట సోషల్ ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేసి బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఆర్.రాజశేఖర్ శ్రీకాకుళం సోషల్ ఫారెస్ట్ రేంజర్‌గా బదిలీపై వెళ్లారు. అమ్మన్నాయుడును ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

### సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటుకు చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ముంగెన్నపాడులో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గమైన పాతపట్నం పరిస్థితిని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు వివరించానన్నారు. ఇక్కడ బహుళ జాతి కంపెనీల ఏర్పాటు అవసరం ఉందని, వారిని ఒప్పించి ఒకటి, రెండు కంపెనీలను తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన కొన్ని నిర్ణయాలు తీసుకోవటం జరిగిందన్నారు. తహసీల్దార్ వై.వి పద్మావతి, ఈఓపీఆర్డీ ఐ.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ గూనానపేటకు చెందిన కుమరాపు దుర్గారావు (28) అనే యువకుడు వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు.. రెండు రోజుల క్రితం ఇంటిలో పురుగుల మందు తాగడంతో అస్వస్థతకు గురైన దుర్గారావును కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దుర్గారావు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

### చట్టాలపై అవగాహన

పొందూరు: పాఠశాల స్థాయి నుంచే బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పొందూరు కోర్టు జడ్జి బీ.జ్యోత్స్న అన్నారు. స్థానిక బాలికల సంక్షేమశాఖ కళాశాల వసతి గృహంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. వసతి గృహం పరిసరాలను పరిశీలించారు. మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి వార్డెన్ శ్రీదేవికి సూచించారు. న్యాయవాది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### చల్లదనం



సరుబుజ్జిలి గ్రామ అసిరితల్లి ఘటాల పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పొందరవీధి భక్తి కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి ముర్రాటలతో చల్లదనం చేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చనలు చేసి, మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

\- సరుబుజ్జిలి

### ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం ఫ్రెషర్స్ డే ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు జానపద, జాతీయ, సినీ గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆలోచింపజేశాయి. ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ అధ్యక్షత సమావేశం జరిగింది. కాలేజీ నుంచి బదిలీపై వెళ్లిపోయిన బోధనేతర సిబ్బందికి సత్కరించారు. ఎద్దు సుందరనారాయణ వరహాలమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎద్దు సుందరనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

\- కొత్తూరు

### ఆకట్టుకున్న వేషధారణలు



సారవకోట మండలంలోని సవరబొంతు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు దసరా ఉత్సవాలు పురస్కరించుకుని మంగళవారం పలు వేషధారణలు ధరించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న సరస్వతీదేవి విగ్రహం దగ్గర పూజలు నిర్వహించారు. అమ్మవారి వేషధారణతో ఆకట్టుకున్నారు.

\- సారవకోట

# నిరుపయోగం



మర్రిగూడ రైతు సేవా కేంద్రంలో మూలకుచేరిన కియోస్క్ డిజిటల్ యంత్రం

- మూలనపడిన కియోస్క్ యంత్రాలు
- ప్రజాధనం వృథా

హిరమండలం: నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా ఉన్నాయి. రైతులు తమ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నేరుగా వారి గ్రామం నుంచే పొందేందుకు ఈ ఆధునిక యంత్రాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీ సచివాలయంలోని రైతు భరోసా కేంద్రంలో ర్పాటు చేసింది. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 91 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించిన గత ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి వాటిని కొనుగోలు చేసింది. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యవసాయ యంత్రాలు, రైతుల పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలు, తదితర అవసరమైన అన్ని సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయ శాఖ అన్నివిధాలా అవగాహన కల్పించింది. వాతవరణ సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు అందించేవారు.

#### నిర్లక్ష్యపు నీడలు

కొత్త కూటమి ప్రభుత్వం హయాంలో రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. కేవలం ఎరువులను మాత్రమే బుకింగ్ చేసుకునేందుకు వాడుతున్నారు. మరికొంత మంది ఎరువుల బుకింగ్ కూడా మెబైల్‌లోనే వాడుతున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుండగా వినియోగంలోలేని కియోస్క్ డిజిటల్ యంత్రాలు బూజుపట్టే పరిస్థితి నెలకొంది. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు. మరి ప్రస్తుతం మొక్కుబడిగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల అందిస్తున్నారు. రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువుల కొనుగోలు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ దాదాపు పూర్తికావస్తోంది. రానున్న రబీ సీజన్‌కైనా వీటి సంపూర్ణ వినియోగానికి ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

| నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాలు, కియోస్క్ యంత్రాల వివరాలు | | |
|---|---|---|
| మండలం | రైతు సేవా కేంద్రాలు | కియోస్క్ యంత్రాలు |
| పాపతట్నం | 18 | 18 |
| హిరమండలం | 13 | 13 |
| కొత్తూరు | 27 | 27 |
| మెళియాపుట్టి | 21 | 21 |
| ఎల్.ఎన్.పేట | 12 | 12 |

#### ఎరవులు అందించాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు పూర్తి స్థాయిలో కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్లు వద్ద అధిక ధరలకు కొనుగోలు చేశాం. గత వైఎస్సార్ ప్రభుత్వంలా రైతులకు అవసరమైన అన్ని ఎరవులూ అందించాలి.

– లుకలాపు శ్రీనివాసరావు, రైతు, కిట్టాలపాడు, హిరమండలం

#### డిజిటల్ విధానం అమలు చేయాలి



నాడు రైతు భరోసా కేంద్రాలలో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో కియోస్క్ యంత్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు, పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు డిజిటల్ సేవలు తెలియజేసేవారు. అప్పటిలాగే ఇప్పుడు కూడా రైతులకు డిజిటల్ సేవలు అందించాలి.

– నక్క ఆనందరావు, రైతు, పాతహిరమండలం

# ఉచితం పేరుతో దోపిడీ



మాట్లాడుతున్న చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: ఉచిత ఇసుక పేరుతో కూటమి నేతలు దొచుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుంచాల సూకరాజు, పార్టీ నాయకులు ఆరోపించారు. కొత్తూరులో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఉచిత ఇసుక పేరు చెప్పి భామిని మండలంలో పలు గ్రామాల వద్ద తవ్వకాలు చేసి టీడీపీ నేతలు అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఉచిత ఇసుక పథకం ద్వారా 20 టన్నుల ఇసుక సుమారు రూ.9,500లకు విక్రయిస్తే.. నేడు రూ.30 వేలకు పైగా వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఆధారాలు లేకుండా తిరుపతి లడ్డూపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను సుప్రీం కోర్టు తప్పుబట్టిన విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సర్పంచ్ ధర్మారావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు అగతమూడి నాగేశ్వరరావు, రంజిత్, ఎండు నాయుడు, తమ్మినాయుడు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల ఉద్యోగుల ఆందోళన



నరసన్నపేట: బజారు షాపు వద్ద ఆందోళన చేస్తున్న ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసే సిబ్బంది

నరసన్నపేట: మద్యం షాపుల వద్ద మంగళవారం ఉదయం నుంచి హైడ్రామా నడిచింది. అటు ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసే సూపర్ వైజర్లు, సేల్స్‌మేన్లు, నైట్‌వాచ్‌మేన్లు నిరసన వ్యక్తం చేశారు. షాపులు తెరవకుండా ఆందోళన చేపట్టారు. ఎక్సైజ్ సీఐ రమణమూర్తి, ఎస్‌ఐ గురుమూర్తి షాపులు తెరిచేందుకు ప్రయత్నించారు. ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం నెలకొంది. ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు డ్రామా కొనసాగింది. సాయంత్రం ఐదు గంటల తరువాత బజారులో షాపును ఎక్సైజ్ పోలీసులు తెరిపించగలిగారు.



పాతపట్నం: నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

పాతపట్నం: మండలంలోని మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం మద్యం దుకాణాలను మూసివేసి నిరసన తెలిపారు. మండల కేంద్రంలో అంతరాబ రోడ్డులో ఉన్న రెండు దుకాణాలు, కొరసవాడ, తెంబూరు, సీది గ్రామాల్లో ఉన్న మద్యం దుకాణాలను కూడా మూసివేసి ఆందోళన చేపట్టారు. సంఘ అధ్యక్షుడు సోమేష్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం తమను అన్యాయంగా తొలగించిందన్నారు.

# వైద్య సేవలను వినియోగించుకోవాలి



వైద్య సేవలను పరిశీలిస్తున్న కల్యాణ్‌బాబు

నరసన్నపేట: వయో వృద్ధుల కోసం జిల్లాలో సామాజిక ఆస్పత్రుల, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని వీటిని వినియోగించుకోవాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి కల్యాణ్ బాబు అన్నారు. నరసన్నపేట వంద పడకల ఆస్పత్రిలో వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆస్పత్రి వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోగులకు సంతృప్తికరంగా వైద్య సేవలు అందించి, మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. ఐదు రోజులపాటు ఆస్పత్రుల్లో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. నరసన్నపేట ఆస్పత్రిలో మార్పు విజయ్ ఈశ్వరమ్మ, ఈశ్వరరావు చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో బెంచీలు వితరణ చేయడాన్ని కల్యాణ్‌బాబు అభినందించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వూడి సంతోష్, నరసన్నపేట సూపరింటెండెంట్ శ్రీనుబాబు, వైద్యురాలు జయశ్రీ, ఏఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఆయాను కొనసాగించాలి



నిరసన తెలుపుతున్న చైర్‌పర్సన్, కమిటీ సభ్యులు

నరుబుజ్జిలి: పెదవెంకటాపురం ప్రాథమిక పాఠశాల మరుగుదొడ్డి క్లీనర్ (ఆయా) పోస్టుకు రాజకీయరంగు రుద్ది తొలగింపునకు కూటమి నాయకులు సిద్ధమయ్యారని పీఎంసీ చైర్‌పర్సన్ అల్లాడ తనూజ ఆరోపించారు. పాఠశాల ఆవరణలో మంగళవారం పాఠశాల కమిటీ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. చైర్‌పర్సన్‌తోపాటు, మెజార్టీ కమిటీ సభ్యుల తీర్మానం ఉన్నప్పటికీ ఆయాను విధుల నుంచి తొలగించేందుకు కూటమి నేతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఆయాను కొనసాగించాలని నినాదాలు చేశారు. చిరుద్యోగిపై కక్షపూరిత చర్యలు తీసుకోవాలనుకోవడం సరికాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కోర్టులను ఆశ్రయిస్తామన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



నరసన్నపేట: దేశవానిపేటలో రవికుమార్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, తదితరులు



పొందూరు: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: మండలంలోని దేశవానిపేట ప్రాథమికోన్నత పాఠశాల, సత్యవరం ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. దేశవానిపేట స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి సింగంశెట్టి రవికుమార్ అండర్ 14 విభాగంలో బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం జయరాం తెలిపారు. సత్యవరం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి డి.లక్ష్మణ పరుగు పందెంలో, బి.హారిక లాంగ్ జంప్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వకులా రత్నమాల తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పొందూరు: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్ బాల్ పోటీల్లో పిల్లలవలస విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. అండర్-14 బాలుర విభాగంలో గురబెల్లి సోమశేఖర్, జి.జీవన్‌కుమార్, కె.జశ్వంత్ ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో జి.అఖిల, జి.సుస్మిత, ఎల్.పావని ఎంపికయ్యారని హెచ్‌ఎం సుగ్గు కాసులబాబు, పీడీ రాజశేఖర్ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

పొందూరు: లోలుగు కేజీబీవీకి చెందిన విద్యార్థిని బి.అంజలి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సౌమ్య, పీఈటీ రూపవతి తెలిపారు. అండర్-17 విభాగంలో ఎంపికైందన్నారు. విద్యార్థినికి ఉపాధ్యాయులు అభినందించారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచంద్రి గ్రామానికి చెందిన అవినాస్ అండర్-19 విభాగంలో జరిగిన యోగా పోటీల్లో జిల్లా స్థాయిలో సత్తాచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని పీడీ పిల్లా రమణమ్మ తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లోనూ అవినాస్ సత్తాచా చాటాడు. అవినాస్‌కు మాజీ జెడ్పీటీసీ శివ్వాల తేజేశ్వరరావు, గ్రామ పెద్దలు అభినందించారు.

### ప్రాంతీయ అభివృద్ధి మండళ్లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పేడాడ జనార్దనరావు

ఆమదాలవలస: రాష్ట్రంలో ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాల ప్రగతికి దోహదపడే ప్రాంతీయ మండళ్లను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విశ్రాంత తహసీల్దార్ పేడాడ జనార్దనరావు కోరారు. మండలంలోని శ్రీహరిపురంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే దేశంలో ఐదు జోనల్ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దక్షిణ ప్రాంతీయ మండలిలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ఉన్నాయని, అదే పద్ధతిలో రాష్ట్రంలో కూడా ప్రాంతీయ మండళ్ల ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ మాజీ కూన అప్పలనాయుడు పాల్గొన్నారు.

### బోరు బాగుచేశారు..

కొత్తూరు: మండల కేంద్రలోని బోరును సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళవారం బాగు చేశారు. బోరు పాడైన విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంటనే బాగు చేయించి ప్రజలకు తాగునీరు అందించారు.

### దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

సారవకోట: మండలంలో గురువారం నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు పలుచోట్ల ఏర్పాట్లు చేస్తున్నారు. సారవకోట, కిడిమిలో మండపాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. అవలింగి నీలమణి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### విద్యార్థులకు అభినందన

పాతపట్నం: నీట్ యూజీ ప్రవేశ పరీక్ష-2024లో ఎంబీబీఎస్‌లో నియోజకవర్గం నుంచి సీట్లు సాధించిన 26 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అభినందించారు. తన క్యాంప్ కార్యాలయంలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు, ఇప్పిలి ధనుంజయరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఘనంగా నివాళులు

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు 120, 155 ఆకారంలో మంగళవారం కూర్చున్నారు. బుధవారం మహాత్ముని 155వ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి 120వ జయంతిని పురస్కరించుకుని అంకెల రూపంలో కూర్చుని నివాళులర్పించారు.



అంకెల ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

### పరామర్శ..



రాంబాబును పరామర్శ చేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

జలుమూరు: మండలంలోని రావిపాడులో ఇటీవల కూటమి నేతల దాడిలో గాయపడిన గుండ రాంబాబును వైఎసాస్సార్‌సీపీ బీసీ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రామయ్యవలసలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కొర్ను రాజును పరామర్శించారు.

పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు దామ మన్మధరావు, మండల సలహాదారుడు పైడి విఠలరావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, అల్లాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బోర సింహాచలం, పి.విజయ్, ధర్మాన బువాజీ తదితరులు ఉన్నారు.

### జిల్లా స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో సత్తా



జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన బాలురు, బాలికలతో పీడీలు

పాతపట్నం: స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి బి.వి.రమణ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పాఠశాలల సాఫ్ట్ టెన్నిస్ క్రీడా ఎంపికలు జరిగాయని సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.అప్పన్న మంగళవారం తెలిపారు. సీనియర్ పీడీలు వై.శేఖర్ బాబు, జె.కృష్ణ, జె.శ్రీను, బి.లోకేష్, సుజాత, దుర్గమ్మ పర్యవేక్షణలో క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. జిల్లా స్థాయిలో బాల, బాలికల ఎంపిక పోటీలు అండర్-14, 17, 19 విభాగాల్లో నిర్వహించామన్నారు. పాతపట్నం మోడల్ స్కూల్ హెచ్‌ఎం కె.వి.రత్నం, ఉపాధ్యాయులు కె.రాంబాబు, డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.